
సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

సోమవారం । 26 । ఫిబ్రవరి । 2024



ఆయిల్ పాం పరిశ్రమ..?

అశ్వాపురం మండలంలో ఆయిల్‌పాం పరిశ్రమ ఏర్పాటు ప్రతిపాదనలకే పరిమితమైందని రైతులు పేర్కొంటున్నారు. 8లో



భారీగా కూరగాయల సాగు..

జిల్లాలోని పలు ప్రాంతాల్లో కూరగాయల సాగు భారీగా పెరుగుతుండగా, రైతులకు ఆదాయం సమకూరుతోంది. 8లో

గరిష్టం / కనిష్టం
34° / 21°

వాతావరణం

జిల్లాలో సోమవారం మధ్యాహ్నం ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉంది. రాత్రి వేళ చలి ప్రభావం ఉంటుంది.

న్యూస్‌రీల్

రామయ్యకు సువర్ణ పుష్పార్చన



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం : భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారికి ఆదివారం అభిషేకం, సువర్ణ పుష్పార్చన వైభవంగా జరిపించారు. తెల్లవారు జామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవా కాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువు దీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

పెద్దమ్మతల్లికి విశేషపూజలు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లికి అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. మండలంలోని శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. క్యూలైన్ ద్వారా అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. అన్నప్రాసనలు, ఒడి బియ్యం, పసుపు కుంకుమలు, చీరలు సమర్పించారు. అర్చకులు పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈఓ ఎన్.రజనీకుమారి, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మహిపతి రామలింగం, డైరెక్టర్లు పాల్గొన్నారు.

నేడు ప్రజావాణి

కొత్తగూడెంఅర్బన్: కలెక్టరేట్ సమావేశపు హాల్‌లో సోమవారం నిర్వహించనున్న ప్రజావాణి కార్యక్రమానికి అన్ని శాఖల జిల్లా అధికారులు సకాలంలో హాజరు కావాలని కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అల ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఫిర్యాదులు స్వీకరిస్తామని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

రామాలయంలో చిన్న గరుడ వాహన సేవ ప్రారంభం



చిన్న గరుడ వాహన సేవను ప్రారంభిస్తున్న ఈఓ, ఏఈఓ

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో భక్తుల సౌకర్యార్థం చిన్న గరుడ సేవను ఆదివారం ప్రారంభించారు. స్వామివారి దర్శనానికి వచ్చిన భక్తులంతా నిత్య కల్యాణం, వాహన సేవల్లో పాల్గొనాలని ఆశ పడుతుంటారు. దీంతో భక్తుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్న ఆలయ అధికారులు చిన్న గరుడ వాహన సేవను ప్రవేశపెట్టారు. రూ.250 టికెట్‌తో స్వామివారు ఆశీనులైన వాహనాలతో పల్లకీ సేవ జరపవచ్చు. దీనిని ఆదివారం ఆలయ ఈఓ రమాదేవి, ఏఈఓ శ్రవణ్‌కుమార్ ప్రారంభించారు. భక్తులు ఈ అవకాశాన్ని ప్రత్యేక రోజుల్లో మినహా నిత్యం సద్వినియోగం చేసుకోవచ్చని తెలిపారు.

కిన్నెరసానిలో పర్యాటకుల సందడి



బోటు షికారు చేస్తున్న పర్యాటకులు

పాల్వంచరూరల్ : మండల పరిధిలోని కిన్నెరసానిలో ఆదివారం పర్యాటకులు సందడి చేశారు. జిల్లా నలుమూలలతో పాటు ఇతర ప్రాంతాల నుంచి కూడా అధిక సంఖ్యలో తరలివచ్చారు. డ్యామ్ పైనుంచి జలాశయాన్ని, డీర్‌పార్కులోని దుప్పులను వీక్షించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆనందోత్సాహాల నడుమ గడిపారు. 352 మంది పర్యాటకులు కిన్నెరసానిలోకి ప్రవేశించడం ద్వారా వైల్డ్‌లైఫ్ శాఖకు రూ.10, 085 ఆదాయం లభించగా, 170 మంది బోటు షికారు చేయడం ద్వారా పర్యాటకాభివృద్ధి సంస్థకు రూ.10, 290 వచ్చినట్లు నిర్వాహకులు తెలిపారు.

తలమానికంగా సింగరేణి



సోలార్ పవర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి తుమ్మల తదితరులు

డిపెండెంట్ ఉద్యోగులకు వయోపరిమితి పెంపు

- 27 నుంచి ఉచిత విద్యుత్, రూ.500 గ్యాస్ అమలు
- సింగరేణిలో స్థానికులకు 80 శాతం ఉద్యోగాలు
- సోలార్ పవర్ ప్లాంట్ ప్రారంభోత్సవంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థ తెలంగాణకు తలమానికంగా నిలవడంతోపాటు సుమారు 2,200 పరిశ్రమలకు తోడ్పానందిస్తోందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఉత్పత్తి చేసిన బొగ్గు ద్వారా కోట్లాది రూపాయల లాభాలు గడిస్తోందని, ఆ లాభాలను కార్మికులను పంచుతామని పేర్కొన్నారు. ఆదివారం కొత్తగూడెం ఏరియా పరిధిలోని రామవరం 3 ఇంక్లైన్‌లో సుమారు 46 ఎకరాల్లో రూ.46 కోట్లతో ఏర్పాటు చేసిన 10.5 మెగావాట్ల



కొత్తగూడెం అర్బన్: డిప్యూటీ సీఎంకు పుష్పగుచ్ఛం ఇస్తున్న కలెక్టర్ ప్రియాంక

సోలార్ పవర్ ప్లాంట్‌ను వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సింగరేణి సంస్థ అభివృద్ధిని, కార్మిక సంక్షేమాన్ని గత బీఆర్ఎస్ ప్రభుత్వం విస్మరించిందని ఆరోపించారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో ప్రతీ బిడ్డకు ఉద్యోగం కల్పించే బాధ్యతతో పనిచేస్తోందని తెలిపారు. ఇందిరమ్మ రాజ్యంలో రెగ్యులర్ కార్మికులు, ఉద్యోగులకు రూ.కోటి ప్రమాద బీమా పథకాన్ని ఈ నెల 26న ప్రారంభిస్తామన్నారు.

శ్రమదోపిడీని నివారిస్తాం

సింగరేణి సంస్థలో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ వ్యవస్థల ద్వారా జరుగుతున్న శ్రమదోపిడీని నివారించాలని, స్థానికులకే 80శాతం ఉద్యోగాలు ఇవ్వాలని కార్మిక సంఘాల నాయకులు, ఎమ్మెల్యేలు కోరుతున్నారని, వారి అభిప్రాయాలతో ఏకీభవిస్తామని తెలిపారు. పదేళ్లు పాలించిన బీఆర్ఎస్ ప్రభుత్వం మినిమం వేజెస్‌పై సమీక్ష చేయలేదన్నారు. కారుణ్య నియామకాలకు డిపెండెంట్ల వయసు 35 నుంచి 40 ఏళ్లకు పెంచామని అన్నారు. ప్రభుత్వం ఏర్పడిన పది రోజుల్లోనే 441 మందికి ఉద్యోగాలు ఇచ్చామని, రెండు రోజుల క్రితం మరో 464 ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చామన్నారు. ప్రస్తుతం బొగ్గు ఉత్పత్తి లక్ష్యం 70 మిలియన్ టన్నులు ఉండగా, రాబోయే కాలంలో 100 మిలియన్ టన్నుల వెలికితీసేలా ప్రణాళికలు తయారుచేశామన్నారు. తాడిచర్ల, కోయగూడెం, రాంపురం బొగ్గు బ్లాకులను వదులుకోబోమని స్పష్టం చేశారు.

రేపటి నుంచి 200 యూనిట్ల విద్యుత్..

ఎన్నికల ముందు ప్రకటించిన ఆరు గ్యారంటీల అమలులో భాగంగా ఈ నెల 27న చేవెళ్లలో రూ.500కే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకాలను అమలు చేస్తామన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేసినట్లుగా కాంగ్రెస్ ప్రభుత్వం చేయదని పేర్కొన్నారు. త్వరలోనే డ్వాక్రా మహిళలకు వడ్డీలేని రుణాలు అందిస్తామని తెలిపారు. బొగ్గు నిక్షేపాలు అంతరిస్తున్న తరుణంలో సింగరేణి యాజమాన్యం సోలార్ విద్యుత్ ప్లాంట్‌లను ఏర్పాటు చేస్తుండటం హర్షణీయమని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వంతో అనుసంధానమై రైతుల పంపు సెట్లకు అవసరమైన విద్యుత్‌కు కోసం సోలార్ యూనిట్లు ఏర్పాటు చేస్తే ప్రభుత్వంపై భారం తగ్గుతుందన్నారు. ఇళ్లపై గృహ అవసరాల కోసం సోలార్ యూనిట్లు ఏర్పాటు చేస్తే మేలని పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క జోడీ బాగా కుదిరిందని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పేర్కొన్నారు. నూతన భూగర్భ గనులను ఏర్పాటు చేయాలని కోరారు. జిల్లా ప్రభుత్వాస్పత్రికి మరో ఐదు డయాలసిస్ యంత్రాలు, పాల్వంచ ఆస్పత్రికి డయాలసిస్ కేంద్రం మంజూరు చేయాలన్నారు. పాల్వంచలో మున్సిపల్ ఎన్నికలు జరిగేలా చర్యలు చేపట్టాలని, కేటీపీఎస్ విస్తరణ చేయాలని కోరారు. అనంతరం రామవరంలోని కాంగ్రెస్ నాయకుడు మోత్కూరి ధర్మారావు ఇంట్లో తేనీటి విందు స్వీకరించారు. తొలుత కలెక్టర్ ప్రియాంక ఆల డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి తుమ్మలకు సింగరేణి గెస్ట్‌హౌస్‌లో స్వాగతం పలికారు. కలెక్టర్ ప్రియాంక ఆల, సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్, డైరెక్టర్లు సత్యనారాయణరావు , వెంకటేశ్వరరెడ్డి, ఎమ్మెల్యేలు పాయం వెంకటేశ్వర్లు, కోరం కనకయ్య, మట్టా రాగమయి, మాలోత్ రాందాస్, జారే ఆదినారాయణ, జెడ్పీచైర్మన్ కంచర్ల చంద్రశేఖర్ రావు, సింగరేణి గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు వాసిరెడ్డి సీతారామయ్య, బి. జనక్ ప్రసాద్‌తోపాటు టి.లక్ష్మీపతి గౌడ్ పాల్గొన్నారు.

సాగునీటి ప్రాజెక్టుల్లో సౌర విద్యుదుత్పత్తికి ప్రణాళికలు

పునరుత్పాదక వనరులతో విద్యుత్ తయారీపై కొత్త పాలసీ రూపొందించాలని అధికారులకు ఆదేశించామన్నారు. భారీ, మధ్య తరహా సాగునీటి ప్రాజెక్టుల, ప్రధాన మెయిన్ కెనాల్స్ బండ్స్‌పై సౌర విద్యుదుత్పత్తికి ప్రణాళికలు తయారు చేస్తున్నామని తెలిపారు. ఎస్ఆర్ఎస్పీ, నాగార్జున సాగర్, శ్రీశైలం జలాశయాల్లో పంప్ స్టోరేజ్ పవర్ ప్లాంట్ ఏర్పాటుపై దృష్టిపెట్టామని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్ రాష్ట్రానికి గుదిబండగా మారిందన్నారు.

ఆదాయ వనరులున్నా..

అభివృద్ధి అంతంతే..!



కొత్తగూడెం పట్టణ నడిబొడ్డున నిరుపయోగంగా ఉన్న విలువైన స్థలం

- అధికారుల్లో అలసత్వం, పట్టించుకోని పాలకవర్గం
- పట్టణంలో నిరుపయోగంగా ప్రభుత్వ స్థలాలు
- వినియోగంలోలేని మున్సిపల్ కాంప్లెక్స్‌లు
- వారపు సంతకు టెండర్ నిర్వహించని వైనం
- ఇదీ కొత్తగూడెం మున్సిపాలిటీ దుస్థితి

కొత్తగూడెంఅర్బన్: జిల్లా కేంద్రం, ఏ గ్రేడ్ మున్సిపాలిటీగా ఉన్న కొత్తగూడెంలో అభివృద్ధి నత్తనడకన సాగుతోంది. పాలకవర్గసభ్యులు సొంత ప్రయోజనాల కోసం తప్ప ప్రజా సమస్యలను పట్టించుకోవడం లేదని, కేవలం కమీషన్లపైనే దృష్టి పెట్టారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల బదిలీపై వచ్చిన మున్సిపల్ కమిషనర్ శేషాంజన్ స్వామికి సమస్యల సవాళ్లు ఎదురవుతున్నాయి. గతంలో జరిగిన తప్పులన్నింటిని సరిచేసుకుంటూ ముందుకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. గతంలో ఉన్న కమిషనర్ వారంలో రెండు రోజులే అందుబాటులో ఉన్నారనే ఆరోపణలు కూడా ఉన్నాయి. దీంతో మున్సిపాలిటీలో టౌన్ ప్లానింగ్ విభాగం, రెవెన్యూ విభాగం, ఇంజనీరింగ్ విభాగాల పాలనలో గాడి తప్పింది. వర్గపోరుతో సతమతవుతున్న పాలకవర్గం పాలనావ్యవహారాలను పట్టించుకోలేదు. మరికొందరు కౌన్సిల్ సభ్యులు క్యాంపులకు గోవాకు వెళ్లి సేదతీరారు. అవిశ్వాసం నేపథ్యంలో కొందరు భారీగానే ముడుపులు పుచ్చుకున్నట్లు బలమైన ఆరోపణలు వచ్చాయి. అధికారులు, పాలకవర్గ సభ్యులు పట్టించుకోకపోవడంతో పట్టణాభివృద్ధి అటకెక్కింది. నూతనంగా బాధ్యతలు చేపట్టిన కమిషనర్ పాలకవర్గంలో రెండు వర్గాలను, సిబ్బందిని సమన్వయం చేసుకుంటూ పాలన సాగించాల్సి ఉంది. ఆదాయ వనరులను సద్వినియోగం చేసుకుని జిల్లాలోని ఇతర మున్సిపాలిటీలకు ఆదర్శంగా నిలబెట్టాల్సిన అవసరముంది.

ఇవీ సమస్యలు

- కొత్తగూడెం రైతుబజార్ సమీపంలో పండ్ల వ్యాపారుల కోసం దాదాపు రూ.33 లక్షలతో నిర్మించిన కాంప్లెక్స్ ప్రస్తుతం నిరుపయోగంగా మారింది. తోపుడుబండ్ల వ్యాపారులను కాంప్లెక్స్ పరిధిలోకి తరలించినా రెండు, మూడు రోజుల తర్వాత మళ్లీ రోడ్లపైకే చేరారు. ఈ నేపథ్యంలో కాంప్లెక్స్‌ను వినియోగంలోకి తెస్తే మున్సిపాలిటీకి ఆదాయం వచ్చే అవకాశం ఉంది.
- పట్టణ పరిధిలోని సెవెన్‌హిల్స్ ఏరియాలో ఉన్న చర్మకారుల సంఘానికి సంబంధించిన కాంప్లెక్స్ శిథిలావస్థకు చేరగా, ఏడాదిన్నర క్రితం మున్సిపల్ అధికారులు తొలగించారు. రూ.కోట్ల విలువ చేసే ఆ స్థలంలో ఎటువంటి నిర్మాణాలూ చేపట్టలేదు. ఖాళీగా ఉండటంతో ఎదురుగా ఉన్న రెస్టారెంట్ నిర్వాహకులు పార్కింగ్‌కు ఉపయోగిస్తున్నారు. అధికారులు దృష్టి పెట్టకపోతే కబ్జాకు గురయ్యే ప్రమాదం కూడా లేకపోలేదు. ఆ స్థలంలో వివిధ వ్యాపారాలకు కాంప్లెక్స్‌లు నిర్మించి అద్దెకు ఇచ్చి ఆదాయం రాబట్టవచ్చు.
- ఏడాదికి రూ.లక్షల్లో ఆదాయం తెచ్చే వారపు సంతకు టెండర్ నిర్వహించకుండా గత ఏడాది నుంచి మున్సిపల్ అధికారులు హోల్డ్‌లో పెట్టి ఉంచారు. అంతకుముందు సంవత్సరం కొందరు వార్డు కౌన్సిలర్లు రింగై వారపు సంతను రూ.50 లక్షలకు టెండర్ పాడారు. అందులో సగం కూడా మున్సిపాలిటీకి చెల్లించకుండా అధికారదర్పంతో ఎగ్గొట్టారు. వారిపై జిల్లా, డీఎంఏ అధికారులు కూడా చర్యలు తీసుకోలేదు.
- వ్యాపారాలకు అనువైన స్థలం రైతుబజార్ సెంటర్‌లో ఉంది. అక్కడ వ్యాపార సముదాయాలు నిర్మిస్తే మున్సిపాలిటీకి ప్రతి ఏడాది మంచి ఆదాయం వచ్చే అవకాశాలుంటాయి. ఇప్పటికైనా పాలకవర్గ సభ్యులు, అధికారులు తీరు మార్చుకుని మున్సిపాలిటీని అభివృద్ధిపథంలో నడిపించాల్సిన అవసరముంది.

అభివృద్ధే ధ్యేయంగా ముందుకు..



కొత్తగూడెం మున్సిపాలిటీ అభివృద్ధే ధ్యేయంగా, మున్సిపాలిటీలోని అందరినీ సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్తాం. ప్రస్తుతం అన్ని విషయాలపై సమగ్ర ప్రణాళిక సిద్ధం చేస్తున్నాం. ఆ వెంటనే ప్రణాళిక ప్రకారం అభివృద్ధి దిశగా ముందుకు సాగుతాం. – శేషాంజన్‌స్వామి, కొత్తగూడెం మున్సిపల్ కమిషనర్

స్వగ్రామానికి పగిడిద్దరాజు..

యాపలగడ్డకు చేర్చిన అరెం వంశీయులు



పగిడిద్దరాజును తోడ్కొని వస్తున్న గిరిజనులు

గుండాల: మేడారం సమ్మక్క భర్త, యాపలగడ్డ గ్రామానికి చెందిన అరెం వంశీయుడు పగిడిద్దరాజును మేడారం జాతర అనంతరం పూజారులు ఆదివారం స్వగ్రామానికి చేర్చారు. ఈ నెల 19 తేదీన యాపలగడ్డ నుంచి కాలినడకన వెళ్లిన పగిడిద్దరాజు 21వ తేదీన మేడారం గద్దెలపైకి చేరుకున్నాడు. మేడారంలో బుధ గురు, శుక్రవారాల్లో గిరిజన సంప్రదాయల ప్రకారం సమక్క–సారలమ్మలతోపాటు పూజలందుకున్నాడు. శనివారం సమ్మక్క–సారలమ్మలు వన ప్రవేశం చేయగా, అదే రోజు అరెం వంశీయులు పగిడిద్దరాజును తిరిగి పాదయాత్రతో తిరుగు పయనమయ్యారు. ఆదివారం రాత్రికి గుండాలకు చేరుకున్నారు. డోలీ చప్పుళ్లు, నృత్యాల నడుమ పడగలతో(జెండాలతో) ఊరేగింపుగా వస్తున్న దేవుడికి స్వాగతం పలికారు. ఆదివారం రాత్రి యాపలగడ్డ గ్రామంలోని పగిడిద్దరాజు–సమ్మక్కల గద్దెల వద్ద పూజలు నిర్వహించి, గర్భగుడికి చేర్చారు. మార్చి 5,6,7వ తేదీల్లో తిరుగుజాతర ఉంటుందని అరెతం వంశీయులు తెలిపారు. ఈ కార్యక్రమంలో అప్పయ్య, లక్ష్మీనర్సు, కాంతారావు, చిన్న కాంతారావు, బిక్షం, లక్ష్మయ్య, సమ్మయ్య, రామారావు, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారిని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం దర్శించుకున్నారు. గర్భాలయంలో స్వయంభూ, ప్రతిష్ఠా అలంకార మూర్తులను దర్శించుకున్నారు. సువర్ణ పుష్పార్చన, ప్రత్యేక పూజలు చేశారు. - యాదగిరిగుట్ట



మోదీ హయాంలోనే ఆదివాసీల అభివృద్ధి

- కౌసల్య జన్మస్థలి నుంచి వచ్చాను
- మన రెండు రాష్ట్రాలకు సారూప్యత ఉంది
- ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణుదేవ్‌సాయ్
- తెలుగులో ప్రసంగించిన సీఎం



మాట్లాడుతున్న ఛత్తీస్‌గఢ్ సీఎం విష్ణుదేవ్ సాయ్, వేదికపై కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

భద్రాచలం: మోదీ హయాంలోనే ఆదివాసీలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందారని ఛత్తీస్‌గఢ్ సీఎం విష్ణుదేవ్‌సాయ్ పేర్కొన్నారు. విజయసంకల్ప యాత్రలో భాగంగా ఆదివారం భద్రాచలంలో నిర్వహించిన భద్రాద్రి – భద్రకాళి క్లస్టర్‌కు సంబంధించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. 'అందరికీ నమస్కారం', 'అందరూ బాగున్నారా', 'నరేంద్ర మోదీ జిందాబాద్' అంటూ తెలుగులో ప్రసంగం ప్రారంభించారు. శ్రీరాముడి తల్లిగారైన కౌసల్య జన్మస్థలం ఛత్తీస్‌గఢ్ రాష్ట్రమని, ఈ ప్రాంత ప్రజల ప్రతినిధిగా భద్రాచల రాముడి దర్శనానికి వచ్చానని అన్నారు. మన రెండు రాష్ట్రాలకు సారూప్యత ఉందని పేర్కొన్నారు. రాబోయే ఎన్నికల్లో మహబూబాబాద్ పార్లమెంటు నుంచి బీజేపీ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ అయోధ్య – భద్రాచలం సర్క్యూట్‌ను కేంద్రం ప్రకటించబోతుందనే సమాచారం తన వద్ద ఉందన్నారు. రాబోయే రోజుల్లో భద్రాచలం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. మహబూబాబాద్‌తో పాటు ఖమ్మం, వరంగల్‌లలో కూడా బీజేపీ అభ్యర్థుల విజయం ఖాయమన్నారు. ఆరు గ్యారంటీల అమలుకు కాంగ్రెస్ పార్టీ ఆపసోపాలు పడుతోందన్నారు. హామీలను అమలు చేయలేక చిల్లులు పడిన రేకుల డబ్బాలో చెల్లని కాసులను వేసినట్టు లొడలొడ వాగుతున్నారంటూ కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేశారు.

ఒకే కుటుంబం దోచుకుంది

ఆరు గ్యారంటీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తోందని కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి అన్నారు. పదేళ్లుగా అధికారంలో ఉన్న బీఆర్ఎస్ రాష్ట్రాన్ని దోచుకుందని విమర్శించారు. కేంద్రంలో రాబోయేది బీజేపీ ప్రభుత్వమేనని, అందులో మనం భాగస్వాములం కావాలంటే ఉమ్మడి వరంగల్, ఖమ్మం జిల్లాల నుంచి ముగ్గురు ఎంపీలను గెలిపించుకోవాలని అన్నారు.

శాపం వల్లే అధికారం పోయింది

భద్రాచలానికి ప్రకటించిన రూ.100 కోట్లు, వరదలప్పుడు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని, ఆ శాపం వల్లే కేసీఆర్ అధికారం కోల్పోయారని యాత్ర కార్యవర్గ నిర్వహణ సభ్యుడు బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో భద్రాచలం కేంద్రంగా కొత్త రైల్వే ప్రాజెక్టులు రానున్నాయని తెలిపారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు రంగా కిరణ్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో మాజీ మంత్రి విజయరామారావు, ఖమ్మం జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే ధర్మారావు, కుంజా ధర్మా, ముస్కు శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పటిష్ట బందోబస్తు

ఏజెన్సీ ప్రాంత కేంద్రమైన భద్రాచలంలో ఛత్తీస్‌గఢ్ సీఎం పర్యటన నేపథ్యంలో పోలీసులు, సీఆర్‌పీఎఫ్ బలగాలు ప్రత్యేక బందోబస్తు చేపట్టాయి. భద్రాచలం ఏఎస్పీ పరితోష్ పంకజ్ రెండు రోజుల ముందే మార్కెట్ యార్డు, దేవస్థానం ప్రాంతాలను పరిశీలించారు. ఆదివారం ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు తనిఖీలను జరిపారు. పర్యటన పూర్తయ్యేవరకు ప్రత్యేక పోలీసు, సీఆర్‌పీఎఫ్ బలగాలు ఆయా ప్రాంతాలను తమ అదుపులోనే ఉంచుకున్నాయి. తొలుత సీఎం విష్ణుదేవ్‌సాయి, బస్తర్ రాజు కమల్ చంద్ర్ బంజ్‌దేవ్‌లకు ఈఓ రమాదేవి, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. స్వామివారి జ్ఞాపికను, ప్రసాదాలను అందచేశారు.

సారపాకలో ఘనస్వాగతం



పోలీసుల గౌరవవందనం స్వీకరిస్తున్న ఛత్తీస్‌గఢ్ సీఎం విష్ణుదేవ్ సాయి

బూర్గంపాడు: భద్రాచలం పర్యటనకు వచ్చిన ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయికి సారపాకలోని ఐటీసీ అనుబంధ భద్రాచలం పబ్లిక్‌స్కూల్ ఆవరణలో బీజేపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు ఘనస్వాగతం పలికారు. ఛత్తీస్‌గఢ్ నుంచి హెలికాప్టర్‌లో వచ్చిన ఆయన పబ్లిక్ స్కూల్ ఆవరణలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌లో దిగారు. అక్కడి నుంచి ఐటీసీ గెస్ట్‌హౌస్‌కు వెళ్లి కొద్దిసేపు సేదతీరారు. అక్కడ ఆయనకు పోలీసులు గౌరవ వందనం సమర్పించారు. అనంతరం అక్కడి నుంచి భద్రాచలం బహిరంగ సభకకు బయలుదేరి వెళ్లారు.

'కాళేశ్వరం'పై రాజకీయాలు ఆపండి

- విమర్శలకే పరిమితమవుతున్న ప్రభుత్వం
- కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా ఉన్న మేడిగడ్డ, అన్నారం బ్యారేజీల నిర్వహణపై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని కామారెడ్డి ఎమ్మెల్యే కె.వెంకటరమణారెడ్డి డిమాండ్ చేశారు. కొత్తగూడెంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మేడిగడ్డ, అన్నారం బ్యారేజీల్లో సమస్యలు ఉన్న విషయం అందరికీ తెలిసిందేనని, దీన్నే పదే పదే చెబుతూ గత ప్రభుత్వంపై ప్రస్తుత సర్కార్ విమర్శలు చేయడానికి పరిమితమైందని అన్నారు. వేసవి సమీపించినందున నీటి కొరతను దృష్టిలో ఉంచుకుని ఈ బ్యారేజీల్లో నీటిని ఎలా నిల్వ చేయాలి, ఎలా ఉపయోగించుకోవాలనే అంశంపై దృష్టి సారించాలని సూచించారు. ఈ మేరకు ఇంజనీర్లు, మేధావులతో చర్చించి సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేశారు. డ్యామ్ సేఫ్టీ బృందం ఇచ్చిన నివేదిక ఆధారంగా కేంద్రం సాయం తీసుకునే విషయంలో రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపాలన్నారు.

అశాస్త్రీయంగా జిల్లాల కుదింపు

గత ప్రభుత్వం శాస్త్రీయబద్ధంగా జిల్లాల విభజన చేయలేదని వెంకటరమణారెడ్డి అన్నారు. కొన్ని చోట్ల అసెంబ్లీ నియోజకవర్గమే ఒక జిల్లాగా ఏర్పాటయ్యాయని, 2026లో నియోజకవర్గాల పునర్విభజన జరిగిన తర్వాత జిల్లాలను కుదించే విషయంపై పునరాలోచన చేయాలని ఆయన అన్నారు. పదేళ్లు అధికారంలో ఉన్న ప్రధాని మోదీకి ఎటువంటి అవినీతి మరకలు అంటలేదని, ఇదే సమయంలో రాష్ట్రంలో అధికారంలో ఉన్న కేసీఆర్‌పై అనేక ఆరోపణలు వచ్చాయని తెలిపారు.

క్లుప్తంగా

వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవ పత్రికల ఆవిష్కరణ



ఆహ్వాన పత్రికలు ఆవిష్కరిస్తున్న దృశ్యం

పాల్వంచ : పాల్వంచ పట్టణంలోని శ్రీనివాసగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానం(గుట్ట)లో ఏప్రిల్ 4న జరగనున్న శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వారి కల్యాణ మహోత్సవ ఆహ్వాన పత్రికలను తహసీల్దార్ వివేక్, పట్టణ ప్రముఖులు డాక్టర్ బిక్కసాని సుధాకర్ ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు నగేశ్ వర్మ, ఫణిరాజ్ ఆచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భక్త సమాజ మండలి అధ్యక్షులు ఆరుట్ల లక్ష్మణాచార్యులు మాట్లాడుతూ కల్యాణ మహోత్సవానికి వచ్చే భక్తుల కు అన్ని రకాల ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండలి గౌరవాధ్యక్షుడు పసుమర్తి వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి ధర్మపురి రాము, ఊకె భద్రయ్య, కందుకూరి రామకృష్ణ, తాటికొండ శ్రీలత, పిట్టా లక్ష్మీరెడ్డి, బండి నారాయణ, ఏటుకూరి నరేశ్, జిన్నె రమేశ్, బండి రాంజీ, నర్సింహకుమార్, వేమూరి వెంకటేశ్వరరావు, మిట్టపల్లి నర్సింహారావు, కిలారు పురుషోత్తం, రాజ సురేంద్రాచారి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ వైర్లు తగిలి లారీ టైర్లు దగ్ధం

చర్ల: మండలంలోని పూసుగుప్ప సమీపంలో ఆదివారం రాత్రి విద్యుత్ తీగలు తగిలి లారీ టైర్లు దగ్ధం కాగా.. డ్రైవర్, క్లీనర్ లారీలో నుంచి దూకి ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. వివరాల్లోకి వెళితే.. చర్ల నుంచి పూసుగుప్ప వైపునకు లారీలో ప్రొక్లెయిన్‌ను తీసుకొచ్చేందుకు వెళ్తున్నారు. ఈ క్రమంలో ఉంజుపల్లి పూసుగుప్ప గ్రామాల మధ్య ఉన్న విద్యుత్ తీగలు తగిలి లారీకి విద్యుత్ సరఫరా అయి టైర్లకు మంటలు అంటుకున్నాయి. దీంతో డ్రైవర్, క్లీనర్‌లు లారీలో నుంచి క్రిందకు దూకి ప్రాణాలు కాపాడుకున్నారు.

కోడి పందేల స్థావరంపై పోలీసుల దాడి

అశ్వారావుపేటరూరల్: మండలంలోని దురదపాడు గ్రామ శివారులోని అటవీ ప్రాంతంలో నిర్వహిస్తున్న కోడి పందేల స్థావరంపై ఆదివారం పోలీసులు దాడి చేశారు. స్థానిక ఎస్ఐ శ్రీరాముల శ్రీను ఆధ్వర్యాన నిర్వహించిన ఈ దాడిలో ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.2,150లతో పాటు ఒక ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రెజర్‌బాంబు పేలి సీఏఎఫ్ హెడ్ కానిస్టేబుల్ మృతి

చర్ల: మావోయిస్టులు అమర్చిన ప్రెజర్ బాంబు పేలి ఓ సీఏఎఫ్ హెడ్ కానిస్టేబుల్ మృతి చెందిన సంఘటన ఆదివారం సాయంత్రం ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లా మిర్తూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బేచాపాల్ క్యాంపు నుంచి ఏరియా డామినేషన్ కోసం ఛత్తీస్‌గఢ్ ఆర్మ్ ఫోర్స్ పోలీసులు కుతుల్‌పారా నుంచి గండోకల్‌పారా మీదుగా వెళ్తున్నారు. ఈ క్రమంలో బేచాపాల్ సమీపంలో మావోయిస్టులు అమర్చిన ప్రెజర్ బాంబు పేలి సీఏఎఫ్ హెడ్‌కానిస్టేబుల్ ఆశీష్‌యాదవ్‌కు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనను బీజాపూర్ జిల్లా ఎస్పీ జితేంద్ర యాదవ్ ధ్రువీకరించారు.

తిలక్‌నగర్‌లో చోరీ..

ఇల్లెందురూరల్: మండలంలోని తిలక్‌నగర్ గ్రామ పంచాయతీలో చోరీ జరిగింది. వివరాల్లోకి వెళితే.. సింగరేణి కార్మికుడు బోయిన రవి కుటుంబసభ్యులతో కలిసి మూడు రోజుల క్రితం మేడారం జాతరకు వెళ్లాడు. తిరిగి ఆదివారం ఇంటికి చేరుకోగా ఇంటికి వేసిన తాళం పగలగొట్టి కనిపించడంతో రవి ఇంట్లోకి వెళ్లి చూశాడు. దీంతో బీరువా పగలగొట్టి అందులో ఉన్న 15 తులాల బంగారం, 50 కిలోల వెండి, రూ.3వేల నగదును గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకుపోయినట్లు నిర్ధారించుకున్నాడు. ఈ మేరకు రవి స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయగా.. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



చోరీ జరిగిన ఇంట్లో పగలగొట్టిన బీరువా

వివాహిత ఆత్మహత్యాయత్నం

నేలకొండపల్లి: ఓ వివాహిత టాబ్లెట్ మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. మండలంలోని రామచంద్రాపురం గ్రామానికి చెందిన రోజా (20) అనే వివాహిత ఆదివారం బీపీ టాబ్లెట్ మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. కుటుంబ సభ్యులు గుర్తించి వెంటనే స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి ఆపై ఖమ్మంకు తరలించారు. ఆత్మహత్యాయత్నానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

భారీగా కూరగాయల సాగు..

- అవసరాలకు అనుగుణంగా విస్తీర్ణం పెంచేందుకు ఉద్యానశాఖ కార్యాచరణ
- జిల్లాలో 10,525 ఎకరాల్లో కూరగాయల సాగు
- అంతర పంటలుగా కూడా అధిక ఆదాయం



బెండ సాగును పరిశీలిస్తున్న అధికారులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లాలో ప్రజల అవసరాలకు అనుగుణంగా కూరగాయల సాగును పెంచేందుకు జిల్లా ఉద్యానశాఖ కార్యాచరణ రూపొందించి అమలుచేస్తోంది. వేసవిలో వంగ, గోరుచిక్కుడు, బెండ, దోస, సార, ఆకుకూరలు, కొత్తిమీర, పుదీన తదితర పంటలు సాగుచేయడం వలన లాభదాయకంగా ఉంటుందని అధికారులు పేర్కొంటున్నారు. ఈదిశగా రైతులకు ఉద్యానశాఖ ఆధ్వర్యంలో అవగాహనా కార్యక్రమాలను కూడా నిర్వహిస్తున్నారు. పంటల దిగుబడి బాగా వస్తే కూరగాయల రేట్లు కూడా తగ్గే అవకాశం ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

ఆధునిక పద్ధతులపై అవగాహన..

కూరగాయల సాగుకు అవసరమైన ఆధునిక పద్ధతులపై రైతాంగానికి అవగాహన కల్పించేందుకు క్షేత్రస్థాయిలో చైతన్య కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. దీంతో రైతులు ఆర్థికాభివృద్ధి దిశగా అడుగులు వేయడానికి అవకాశం ఏర్పడుతుంది. ఎత్తయిన మడులు, మల్చింగ్ విధానం, బిందు సేద్యం, పార్టిగేషన్, సేంద్రియ పద్ధతులపై అవగాహన కల్పిస్తున్నారు.

భారీగా కూరగాయల సాగు..

జిల్లాలోని జూలూరుపాడు మండలం కూరగాయల సాగులో అగ్రస్థానంలో ఉండగా సుజాతనగర్ మండలం ద్వితీయస్థానంలో ఉంది. అన్నపురెడ్డిపల్లి, భద్రాచలం, చంద్రుగొండ, దమ్మపేట మండలాల్లో రైతులు కూరగాయల సాగువైపు మక్కువ చూపడం లేదు. ఆళ్లపల్లి, అశ్వారావుపేట, చర్ల, కరకగూడెం, కొత్తగూడెం మండలాల్లో నామమాత్రంగా సాగు చేస్తున్నారు.

కూరగాయల సాగు వివరాలిలా..

జిల్లాలో అధికారిక గణాంకాల ప్రకారం ఆళ్లపల్లి మండలంలో 76 ఎకరాలు, అన్నపురెడ్డిపల్లి మండలంలో 5 ఎకరాలు, అశ్వాపురం మండలంలో 0, అశ్వారావుపేట మండలంలో 813 ఎకరాలు, భద్రాచలంలో 0, బూర్గంపాడు మండలంలో 381 ఎకరాలు, చంద్రుగొండ మండలంలో 0, చర్ల మండలంలో 36 ఎకరాలు, చుంచుపల్లి మండలంలో 8 ఎకరాలు, దమ్మపేట మండలంలో 0, దుమ్ముగూడెం మండలంలో 32 ఎకరాలు, గుండాల మండలంలో 61 ఎకరాలు, జూలూరుపాడు మండలంలో 4,393 ఎకరాలు, కరకగూడెం మండలంలో 6 ఎకరాలు, కొత్తగూడెంలో 17 ఎకరాలు, లక్ష్మీదేవిపల్లి మండలంలో 254 ఎకరాలు, మణుగూరులో 104 ఎకరాలు, ములకలపల్లి మండలంలో 124 ఎకరాలు, పాల్వంచ మండలంలో 40 ఎకరాలు, పినపాక మండలంలో 36 ఎకరాలు, సుజాతనగర్ మండలంలో 3,464 ఎకరాలు, టేకులపల్లి మండలంలో 320 ఎకరాలు, ఇల్లెందు మండలంలో 139 ఎకరాల్లో కూరగాయలు పండిస్తున్నారు.

రైతులకు విత్తనాలు పంపిణీ..



రైతులకు కూరగాయల విత్తనాలను పంపిణీ చేస్తున్న కలెక్టర్

ఆధునిక కూరగాయల విత్తనాలను ఎస్సీ, ఎస్టీ రైతులకు జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల పంపిణీ చేశారు. బెంగళూరు భారతీయ ఉద్యాన పరిశోధన సంస్థ (ఐఐహెచ్‌ఆర్) రూపొందించిన వంగ, బీర, టమాట, దోస, పాలకూర తదితర రకాలను పంపిణీ చేశారు.

కూరగాయల సాగు లాభదాయకం



మార్కెట్‌లో కూరగాయలకు డిమాండ్ ఉంది. రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు ఆసక్తి చూపి కూరగాయలు, పూలసాగును చేపట్టాలి. తద్వారా ఆర్థికంగా ఎదగడానికి ఉపయోగపడుతుంది. జిల్లా ప్రజలకు అవసరమైన కూరగాయలు పండిస్తే, రైతులకు లాభాలతోపాటు దిగుమతి చేసుకునే అవసరం ఉండదు. – జినుగు మరియన్న, జిల్లా ఉద్యాన పట్టు పరిశ్రమ శాఖాధికారి



ఆయిల్‌పాం పరిశ్రమ ప్రతిపాదనలకేనా?

- 200 ఎకరాల ప్రభుత్వ భూమిలో ఏర్పాటుకు సన్నాహాలు
- రెండేళ్ల క్రితమే సీతరాంపురంలో గుర్తింపు
- కొత్త ప్రభుత్వం దృష్టి సారించాలని రైతుల వేడుకోలు

అశ్వాపురం: మండలంలో ఏర్పాటు చేయనున్న ఆయిల్‌పాం పరిశ్రమ ఏర్పాటు అవుతుందా లేదా ప్రతిపాదనలకే పరిమితమవుతుందా? అని ఆయిల్‌పాం సాగు చేస్తున్న రైతులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. మండల పరిధిలోని సీతరాంపురం గ్రామంలో ఆయిల్‌పాం పరిశ్రమ ఏర్పాటుకు సర్వే నంబర్ 997లో 200 ఎకరాల ప్రభుత్వ భూమిని గుర్తించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. జిల్లా కేంద్రంతో పాటు భద్రాచలానికి దగ్గరగా ఉండడంతో సీతరాంపురంలో పరిశ్రమ ఏర్పాటుకు అనుకూలంగా ఉంటుందని ఈ ప్రాంతాన్ని ఎంపిక చేసి ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించారు. ములుగులో ఆయిల్‌పాం మొక్కల పెంపకం కేంద్రం ఉండడంతో దగ్గరలో ఉన్న ప్రాంతంలో పరిశ్రమ ఏర్పాటుకు అనుకూలంగా భావించారు. రెండేళ్ల క్రితం స్థలం గుర్తించి ప్రతిపాదనలు పంపినా.. ఆయిల్‌పాం పరిశ్రమ ఏర్పాటుకు సంబంధించి ఎలాంటి కార్యరూపం దాల్చలేదు. నూతన ప్రభుత్వం ఏర్పాటు కావడంతో మండలంలో ఆయిల్‌పాం పరిశ్రమ ఏర్పాటు అవుతుందో లేదోనని అయోమయంలో ఆయిల్‌పాం సాగు చేస్తున్న రైతులు ఉన్నారు. ప్రభుత్వం పరిశ్రమ ఏర్పాటుపై దృష్టి సారించాలని రైతులు కోరుతున్నారు.

నియోజకవర్గాల్లో సాగు వివరాలిలా..

జిల్లాలో 64,436ఎకరాల్లో ఆయిల్‌పాం సాగవుతోంది. ఇందులో పినపాక నియోజవకర్గంలో 1,228 ఎకరాల్లో ఆయిల్‌పాం సాగవుతుండగా.. ఆళ్లపల్లిలో 148 ఎకరాలు, బూర్గంపాడులో 289, కరకగూడెంలో 83, అశ్వాపురంలో 281, గుండాలలో 114, పినపాకలో 189, మణుగూరులో 124 ఎకరాల్లో రైతులు సాగు చేస్తున్నారు. అలాగే భద్రాచలంలో నియోజకవర్గంలో 321 ఎకరాల్లో ఆయిల్‌పాం సాగవుతుండగా.. భద్రాచలంలో 7, దుమ్ముగూడెంలో 234, చర్లలో 80 ఎకరాల్లో సాగుచేస్తున్నారు. అయితే ఈ ఏడాది ఆయిల్‌పాంకు సిద్ధమవుతున్న రైతులు ఎక్కువగానే ఉండడంతో మరో 10వేల ఎకరాల్లో సాగు పెరిగేందుకు అవకాశం ఉంది. ఆయిల్‌పాం సాగుకు అనుగుణంగా జిల్లాలో మరో పరిశ్రమ ఏర్పాటు అవసరం ఉండనున్న నేపథ్యాన కొత్తగూడెం, భద్రాచలానికి దగ్గరలో ఉన్న పినపాక నియోజకవర్గంలో ఆయిల్‌పాం పరిశ్రమ ఏర్పాటు చేయాలని ఈ ప్రాంత రైతులు కోరుతున్నారు.

పరిశ్రమ పరిశీలనలో ఉంది..



అశ్వాపురం మండలం సీతరాంపురంలో ఆయిల్‌పాం పరిశ్రమ ఏర్పాటుకు రెండేళ్ల క్రితం ప్రభుత్వ స్థలం గుర్తించాం. ఆయిల్‌పాం పరిశ్రమ ఏర్పాటు ఆయిల్‌ఫెడ్ వారి పరిశీలనలో ఉంది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు త్వరలోనే పరిశ్రమ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం.

– జినుగు మరియన్న, జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమల శాఖ అధికారి

బీమా కంపెనీ అప్పీల్‌ను కొట్టేసిన హైకోర్టు

బాధితుడికి రూ.1,27,10,500 నష్టపరిహారం ఇచ్చేలా కోర్టు తుది తీర్పు

ఖమ్మం లీగల్: రోడ్డు ప్రమాద బాధితుడికి బీమా నియమనిబంధనల ప్రకారం బీమా కంపెనీ నష్టపరిహారం చెల్లించాల్సిందేనని తెలంగాణ రాష్ట్ర హైకోర్టు డివిజన్ బెంచ్ న్యాయమూర్తులు జస్టిస్ పి.శ్యాంకోషి, జస్టిస్ ఎన్.తుకరాంజీ ఈ నెల 15వ తేదీన తీర్పు ఇచ్చారు. వివరాల్లోకి వెళితే.. అక్టోబర్ 22, 2014న ఉదయం ఖమ్మానికి చెందిన మొక్కజొన్నల హోల్‌సేల్ వ్యాపారి రామిశెట్టి శ్రీనివాసరావు తన భార్య పేరుతో ఉన్న ప్రైవేట్ మారుతి కారులో ఖమ్మం నుంచి విజయవాడ వెళ్తున్నాడు. ఈక్రమంలో డ్రైవర్ మితిమీరిన వేగంతో నిర్లక్ష్యంగా కారును నడిపి చింతకాని పోలీస్‌స్టేషన్ పరిధిలోని నామవరం దగ్గర రోడ్డుపక్కన ఉన్న చెట్టును ఢీకొట్టాడు. ఫలితంగా కారులో ప్రయాణిస్తున్న శ్రీనివాసరావుకి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటనపై చింతకాని పోలీసులు డ్రైవర్‌పై క్రిమినల్ కేసు నమోదు చేశారు.

బాధితుడి వైపే కోర్టుల తీర్పు..

ఖమ్మంలో బాధితుడు శ్రీనివాసరావు రూ.1.75కోట్లకు జిల్లా మోటార్ యాక్సిడెంట్ ట్రిబ్యూనల్‌లో నష్టపరిహారం కోసం జూలై 30, 2015న కేసు దాఖలు చేశాడు. అతడికి 75 శాతం అంగవైకల్యానికి గురైనట్లు ఖమ్మం మెడికల్ బోర్డు ధ్రువీకరిస్తూ కోర్టులో సాక్ష్యం చెప్పారు. శ్రీనివాసరావుకు వార్షిక ఆదాయం రు.8,27,759 ఉన్నట్లు, అంగవైకల్యాన్ని సైతం రుజువు చేయడంలో భాగంగా ఆదాయ పన్ను శాఖ మూడేళ్ల వార్షిక నివేదికలు కోర్టులో దాఖలు చేశారు. దీంతో బాధితుడు కేసు నిరూపించడంలో భాగంగా ఆదాయ పన్ను శాఖ సంబంధిత అధికారులు, ఆడిటర్లు, డాక్టర్లను మొత్తం 12 మంది సాక్షులను కోర్టు విచారించారు. బాధితుడి భార్య సునిత కారు యజమాని అవడంతో అందులో ప్రయాణిస్తున్న భర్త శ్రీనివాసరావు కూడా యజమాని అవుతాడు కాబట్టి ఓరియంట్ బీమా కంపెనీ వారు వారికి ఎటువంటి నష్టపరిహారం చెల్లించాల్సిన బాధ్యత లేదని కోర్టులో వాదించింది. ఇరుపక్షాల వాదనలు విన్న అప్పటి 8వ అదనపు జిల్లా జడ్జి పి.చంద్రశేఖరప్రసాద్ డిసెంబర్ 2, 2019న బాధితుడికి రూ.1,25,10,500లు నష్ట పరిహారం మంజూరు చేసింది. అంతేకాక 6 శాతం వార్షిక వడ్డీతో కోర్టులో పరిహారం కేసు దాఖలు చేసిన తేదీ నుంచి చెల్లించాలని న్యాయమూర్తి తీర్పునిచ్చారు. తీర్పును సవాల్ చేస్తూ బీమా కంపెనీ రాష్ట్ర ఉన్నత న్యాయస్థానంలో అప్పీలు దాఖలు చేయగా.. బాధితుడు కూడా తనకు తనకు పరిహారం పెంచాలని క్రాస్ అబ్జక్షన్స్ దాఖలు చేశాడు. దీంతో ఇరు పక్షాల వాదనలు విన్న రాష్ట్ర హైకోర్టు డివిజన్ బెంచ్ సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన అనేక తీర్పులను పరిశీలించి మీమా కంపెనీ అప్పీల్‌ను కొట్టిసి బాధితుడికి కింది కోర్టు ఇచ్చిన పరిహారానికి అదనంగా మరో రూ.2 లక్షలు పెంచుతూ తీర్పు చెప్పింది. హైకోర్టులో న్యాయవాది కాశిరెడ్డి జగత్‌పాల్‌రెడ్డి, కింది కోర్టులో శ్రీరామిశెట్టి హరిప్రసాద్‌లు బాధితుడి తరపున వాదించారు.

టేకులపల్లిలో వైన్‌షాపు సీజ్

టేకులపల్లి: మండలంలో మొత్తం నాలుగు వైన్‌షాపులు ఉండగా.. వాటిలో పల్లవి వైన్స్ పేరుతో ఉన్న ఒక వైన్ షాపును ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సీజ్ చేశారు. ఈనెల 19వ తేదీన ఈ షాపుపై ఫిర్యాదు రావడంతో ఆబ్కారీ అధికారులు ఆకస్మికంగా దాడి చేసి షాపుకి తాళాలు వేశారు. కానీ ఈ విషయాన్ని మీడియాకు చెప్పకపోవడం గమనార్హం. ఈ విషయమై ఇల్లెందు ఎక్సైజ్ సీఐ రాంప్రసాద్‌ను వివరణ కోరగా.. ఎమ్మార్పీ వయోలెన్స్‌పై ఫిర్యాదు రావడంతో ఎన్‌ఫోర్స్‌వారు సీజ్ చేసి కేసు నమోదు చేశారని, ఎక్సైజ్ ఎస్ఐ కొత్తగా వచ్చారు.. తానేమో మేడారం డ్యూటీలో ఉండడంతో మీడియాకు చెప్పడం మరిచిపోయామని సమాధానం ఇచ్చారు.

రిమోట్ కంట్రోల్‌తో మిర్చి తూకంలో మోసం..

దుమ్ముగూడెం: ఆరుగాలం కష్టపడి పండించిన పంటలు రైతులకు చేతికొచ్చిన తర్వాత కూడా వాటిని అమ్ముకునే సమయాన కొందరు వ్యాపారస్తుల మోసాలకు బలికావాల్సి వస్తోంది. మండలంలోని మారాయిగూడెం గ్రామానికి చెందిన సొందె రాజు దగ్గరకు సుజాతనగర్‌కు చెందిన మిర్చి కొనుగోలు వ్యాపారస్తులు కొనుగోలు నిమిత్తం ఆదివారం ఉదయం వచ్చారు. మిర్చి కాంటా వేసి తమ వాహనంలో లోడ్ చేసుకున్న తర్వాత మొత్తం లెక్క కట్టడంతో మిర్చి తూకం తక్కువ రావడంతో వారిని నిలదీశారు. మొత్తం మిర్చిని కిందకు దించిన వెంటనే వాహనం వేసుకుని ఓ వ్యక్తి పరారు కాగా మరో వ్యక్తిని అదుపులోకి తీసుకుని తనిఖీ చేశారు. దీంతో కొనుగోలుదారుల వద్ద నుంచి కాంటా రిమోట్ లభించడంతో గ్రామస్తులు వారిని పట్టుకున్న వ్యక్తికి దేహశుద్ధి చేయగా మరో వ్యక్తి పరారీలో ఉన్నాడు. సాయంత్రం వరకు ఆ వ్యక్తి గ్రామస్తుల అదుపులోనే ఉన్నట్టు సమాచారం.



వ్యాపారస్తులు ఉపయోగించిన కాంటా, రిమోట్



గ్రామస్తుల అదుపులో ఉన్న వ్యక్తి

తుమ్మలచెరువులో లభ్యమైన మృతదేహం గుర్తింపు



బసవయ్య(ఫైల్)

అశ్వాపురం: మండల పరిధిలోని తుమ్మలచెరువులో శనివా రం లభ్యమైన మృతదేహాన్ని ఆదివారం గుర్తించారు. మృతుడు తుమ్మలచెరువు గ్రామ పంచాయతీలోని కోరెంవారిగుంపు గ్రామానికి చెందిన పాయం బసవయ్య (37)గా గుర్తించినట్టు ఎస్సై సురేశ్ తెలిపారు. బసవయ్య ఇంటి నుంచి బయటకు వెళ్లి గత నాలుగు రోజులుగా కనబడటం లేదు. చెరువులో పడి ఎలా చనిపోయాడో కారణాలు తెలియలేదు. బసవయ్య మృతిపై స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తుండగా.. పోలీసులు సమగ్ర దర్యాప్తు చేపట్టాలని బసవయ్య తమ్ముడు కృష్ణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

మార్చురీలో గుర్తుతెలియని యువకుడి మృతదేహం

బూర్గంపాడు: బూర్గంపాడులోని ఇండియన్ ఆయిల్ బంక్ సమీపాన శనివారం గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ యువకుడు(20) మృతిచెందాడు. ఆ యువకుడు ఎవరనేది ఆదివారం రాత్రి వరకు తెలియరాలేదు. నడుచుకుంటు వెళ్తున్న యువకుడిని గుర్తు తెలియన వాహనం ఢీ కొట్టడంతో తలకు తీవ్ర గాయమై మృతిచెందాడు. మృతదేహాన్ని బూర్గంపాడు సివిల్ ఆస్పత్రిలోని మార్చురీలో ఉంచారు. మృతుడివివరాల కోసం పోలీసులు దర్యాప్తు చేయగా.. అతడు ఛత్తీసగఢ్‌కు చెందిన వలస ఆదివాసీ కూలీగా తెలుస్తోంది. బూర్గంపాడు పరిసర గ్రామాల్లో మిర్చి కోతకు గాని, జామాయిల్ కర్ర నరికేందుకు వచ్చి ఉంటారని భావిస్తున్నారు.

గొత్తికోయ యువకుడి ఆత్మహత్య

టేకులపల్లి: ప్రేమించిన యువతి ఫోన్ లిఫ్ట్ చేయడం లేదని మనస్తాపం చెందిన గొత్తికోయ యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. బోడు ఏఎస్ఐ బీల్యా నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నుంచి 22 ఏళ్ల క్రితం టేకులపల్లి మండలం బర్లగూడెం పంచాయతీ మొట్లగూడెం గ్రామానికి వలస వచ్చిన గొత్తికోయ మొక్కటి దేవయ్య కుమారుడు మొక్కటి దేవా(21) ఛత్తీస్‌గఢ్‌కు చెందిన ఓ యువతితో ప్రేమాయణం సాగిస్తున్నాడు. గత కొంతకాలంగా ఆ యువతి ఈ యువకుడు ఎన్నిసార్లు ఫోన్ చేసినా లిఫ్ట్ చేయడం లేదు. దీంతో శనివారం రాత్రి మనస్తాపం చెందిన యువకుడు మద్యం సేవించి ఆ తరువాత గుర్తుతెలియని పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు 108లో ఆళ్లపల్లి పీహెచ్‌సీకి ఆపై కొత్తగూడెం ఏరియా ఆస్పత్రికి తరలించగా.. వైద్యులు పరీక్షించి అప్పటికే ఆ యువకుడు మృతి చెందినట్లు ధ్రువీకరించారు. ఆదివారం తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మహిళా సిబ్బందికి న్యూడ్ కాల్స్..

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌లో పని చేస్తున్న మహిళా సిబ్బందికి పబ్లిక్ హెల్త్ ఉద్యోగి ఒకరు న్యూడ్ కాల్స్ చేసి వేధిస్తున్న సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. రెండు రోజుల క్రితం పబ్లిక్ హెల్త్ వర్కర్‌గా పని చేస్తూ కుక్కలను పట్టే విభాగంలో ఉన్న సదరు ఉద్యోగి కొంత మంది మహిళా జవాన్‌లకు వాట్సాప్ ద్వారా వీడియో కాల్ చేసి అసభ్యకరంగా ప్రవర్తించినట్లు సమాచారం. ఒంటిపై దుస్తులు లేకుండా వీడియో కాల్ మాట్లాడాడని, పదేపదే తమను ఇబ్బందులకు గురి చేశాడని సదరు మహిళా సిబ్బంది కేఎంసీ అధికారులకు శనివారం ఫిర్యాదు చేశారు. అసభ్యకరంగా ప్రవర్తిస్తున్న ఉద్యోగిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మహిళా సిబ్బంది ఫోన్ కట్ చేసినా.. పదేపదే ఫోన్ చేసి వేధించినట్లు అధికారుల వద్ద సిబ్బంది మొర పెట్టుకున్నారు. మహిళల పట్ల అసభ్యకరంగా ఓ ఉద్యోగి ప్రవర్తించాడని, ఆధారాలతో సహా అధికారుల దృష్టికి తీసుకెళ్లినా.. ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై కార్మిక సంఘాలు అసహనం వ్యక్తం చేస్తున్నాయి. తప్పు చేసిన సిబ్బందిపై చర్యలు తీసుకోవడానికి అధికారులకు ఏమి ఇబ్బంది వచ్చిందని, సదరు ఉద్యోగిపై ఇప్పటి వరకు ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నిస్తున్నారు. దీనిపై కేఎంసీ అసిస్టెంట్ కమిషనర్‌ను వివరణ కోరగా.. తమకు ఈ ఘటనపై ఫిర్యాదు అందిందని, కమిషనర్ రాగానే ఆయన దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఆరు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



పట్టుకున్న ఇసుక ట్రాక్టర్లతో రెవెన్యూ, పోలీస్ అధికారులు

బూర్గంపాడు: అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను ఆదివారం తెల్లవారుజామున రెవెన్యూ పోలీసులు పట్టుకున్నారు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని బుడ్డగూడెం గ్రామ సమీపంలోని కిన్నెరసాని నుంచి అక్రమంగా ఇసుకను రవాణా చేస్తున్నారు. ఈక్రమంలో ఇసుక అక్రమ రవాణాను అరికట్టే చర్యలలో భాగంగా తనిఖీలు నిర్వహిస్తున్న రెవెన్యూ అధికారులకు ఆదివారం తెల్లవారుజామున రెండు ఇసుక ట్రాక్టర్లు పట్టుబడ్డాయి. దీంతో ఆ ట్రాక్టర్లను బూర్గంపాడు పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ దాడిలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నర్సింహారావు, ఏఎస్సై వై.వీ.వీ. సత్యనారాయణ పాల్గొన్నారు.

మాధారంలో నాలుగు ఇసుక ట్రాక్టర్లు..

ములకలపల్లి: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను ఆదివారం పోలీసులు సీజ్‌చేశారు. ఎస్సై రాజమౌళి కథనం ప్రకారం మండల పరిధిలోని మాధారం శివారులో అక్రమంగా ఇసుక తరలిస్తున్నారన్న సమాచారం మేరకు పోలీసులు దాడులు చేసి నాలుగు ట్రాక్టర్లను పట్టుకున్నారు. దీంతో ఇసుక తరలింపున కు ఎటువంటి అనుమతిపత్రాలు లేకపోవడంతో వా టిని సీజ్ చేసి, కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

● పచ్చని తివాచీ పరిచినట్లు..!



దొంతికుంట సాగునీటి చెరువులో అల్లుకున్న గుర్రపు డెక్క తీగలు

చెరువు నిండా విస్తరించిన గుర్రపు డెక్క పచ్చని అందాలతో కనువిందు చేస్తోంది. దూరం నుంచి చూసే వారికి ఇదేదో పంట పొలంలో పచ్చని తివాచీ పరిచినట్లు భ్రమింపజేసినట్లు కనిపిస్తోంది. నియోజకవర్గ కేంద్రమైన అశ్వారావుపేటలోని దొంతికుంట చెరువులో పెరిగిన ఈ గుర్రపు డెక్క తీగ అంతా విస్తరించింది. పాలకులు పట్టించుకోకపోవడం, నీటి పారుదల శాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగా పంట పొలాలకు సాగునీరు, స్థానికులకు ఆహ్లాదాన్ని పంచాల్సిన ఈ చెరువు కొన్నేళ్లుగా నిర్లక్ష్యానికి గురవుతోంది. దీంతో చెరువంతా వ్యర్థాలు, గుర్రపు డెక్క తీగలతో నిండిపోయింది. ఈ దృశ్యాన్ని ఆదివారం 'సాక్షి'కెమెరాలో బంధించారు.

– అశ్వారావుపేటరూరల్